శారద దరహాసాలు

సంపాదకుడు
ఆచార్య యస్వీ. జోగారావు
ఆంధ్ర శాఖాధ్యక్షులు, ఆంధ్ర విశ్వకళాపరిషత్తు

# వ్యాసపీఠం

[ కవిత్రయ భారత సమీక్ష ]

రచన
డాక్టర్ చిలుకూరి సుబ్రహ్మణ్యశాస్త్రి, ఎం.ఏ., పిఎచ్.డి.
రీడరు, తెలుగు శాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్తు

894.8271
SUB

ఆంధ్రా యూనివర్సిటీ ప్రెస్సు
వాల్తేరు, విశాఖపట్టణం 530 003

Dr. B. R. AMBEDKAR
OPEN UNIVERSITY
LIBRARY
HYDERABAD-500 033

# శారద దరహాసాలు

సంపాదకుడు

ఆచార్య యస్వీ. జోగారావు
ఆంధ్ర శాఖాధ్యక్షులు, ఆంధ్ర విశ్వకళాపరిషత్తు

# వ్యాసపీఠం

[ కవిత్రయ భారత సమీక్ష ]

రచన

డాక్టర్ చిలుకూరి సుబ్రహ్మణ్యశాస్త్రి, ఎం.ఏ., పిఎచ్.డి..
రీడరు, తెలుగు శాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్తు

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10905

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.
10905

ఆంధ్రా యూనివర్సిటీ ప్రెస్సు
వాల్తేరు, విశాఖపట్టణం 530 003

కాపీలు 500 జనవరి 1979

T
894.8271
SUB

© ఆంధ్రా యూనివర్సిటీ

సీరీస్ నె. 153-A

వెల : రు. 1-75

ప్రతులకు :

డైరెక్టరు, ఆంధ్రా యూనివర్సిటీ ప్రెస్ అండ్ పబ్లికేషన్స్
వాల్తేరు, విశాఖపట్టణం 530 003

ముద్రణ : డా॥ సి. బొర్రేశ్వరరావు, డైరక్టరు, ఆంధ్రా యూనివర్సిటీ ప్రెస్ అండ్ పబ్లికేషన్స్,
వాల్తేరు, విశాఖపట్టణం 530 003

A0UA102B121

**ఆచార్య యస్వీ. జోగారావు, ఎం.ఏ., పిఎచ్.డి.**
*ఆంధ్ర శాఖాధ్యక్షుడు*
**ఆంధ్ర విశ్వకళాపరిషత్తు, వాల్తేరు**

ఆగస్టు 8, 1978

# సంపాదకీయ భూమిక

అచిరకాలంలో ప్రపంచ వ్యాప్త ప్రతిష్ఠ నందుకొన్న మా ఆంధ్ర విశ్వకళాపరిషత్తు తన స్వర్ణోత్సవం జూలైలో జరుపుకున్నది. ఆంధ్ర విశ్వకళాపరిషత్తులో కాలక్రమాన అవతరించిన ఇతర శాఖలన్నీ ఆమెకు బిడ్డలైతే మా తెలుగు శాఖ మాత్రం తోబుట్టువు. ఈ శాఖలో పరిశ్రమిస్తూవచ్చిన అధ్యాపకు లెందరెందరో తమ పాఠప్రవచనం ద్వారా, రచనల ద్వారా, శిష్యుల ద్వారా, సభావేదికల ద్వారా ఆంధ్రభాషాసాహితీ సంస్కృతి సంప్రదాయ మహాధ్వంలో సురభిళ సుమవృష్టులు కురిపించారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని మా విశ్వకళాపరిషత్ కులపతులు, ఈ స్వర్ణోత్సవ సారథులు, ఉదారచరితులు, సముదాత్తసంస్కృతి ప్రతిష్ఠామహితాత్ములు శ్రీ ఎమ్.ఆర్. అప్పారాయ మహోదయులు తెలుగుజాతి సంస్కృతికి జీవగఱ్ఱలైన కతిపయ ప్రముఖ సాహిత్యాంశాలపై సామాన్యుల అవగాహనకు చేరికగా చిరుపొత్తాలను రూపొందించవలసినదిగా మమ్ము ఆదేశించారు. వారి సంకల్ప బలంతో నా సహవ్రతుల పరిశ్రమఫలంగా వెలిశాయి ఈ 'తెలుగు శారద దరహాసాలు.'

ఇదివర కిటువంటి ప్రయత్నం ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మన అకాడమీలు చేయకపోలేదు. కాని మా పరిషత్తు యొక్క స్వర్ణోత్సవ సందర్భంగా ఈ సువిశాల తెలుగుసంస్కృతి ప్రపంచంలో మా పౌరస్వత్వాన్ని మేమూ ప్రకటించుకోదలిచాము. మా భాగస్వామ్యం మేము నిలుపుకోదలిచాము. అయితే ఈ కృతులు పరిమితిలో చాల చిన్నవి. సంఖ్యలో పది మాత్రమే. దీపం చిన్నదైనా దీధితి దశదిశలా ప్రసరిస్తే, పదిమంది జిజ్ఞాసువులు భళా అంటే అదే పదివేలు మాకు.

యస్వీ. జోగారావు
*సంపాదకుడు*

# వ్యాసపీఠం

(కవిత్రయ భారత సమీక్ష)

ధర్మేచార్థేచ కామేచ మోక్షేచ భరతర్షభ
యది హాస్తి తదన్యత్ర యన్నేహాస్తినతత్ క్వచిత్ ॥

(ధర్మార్థ కామ మోక్షాల విషయంలో ఇందులో ఉన్నది మిగిలిన చోట్లకూడా ఉంటుంది. ఇందులో లేనిది ఇంకెక్కడా ఉండదు.)

అని కంఠోక్తిగా భారతాన్ని గురించి అన్నారు. ఆ నాటికి మానవ జీవితానికి ఒరవడి పెట్టదగిన విషయాలన్నీ ఇందులో ఉన్నాయి అనడంలో ఎట్టి అతిశయోక్తి లేదు. ఇందులో ఉన్న విషయాలు ఆ నాటికేగాదు ఏ నాటికీ మార్గ నిర్దేశకాలే అనవచ్చు. ఇందులో ఉండే విషయ గౌరవాన్ని ప్రస్తావిస్తూ, పై అభిప్రాయాన్ని వివరిస్తూ ఆంధ్ర భారతం ఇల్లా అంటోంది :

"ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని,
యధ్యాత్మ విదులు వేదాంతమనియు,
నీతి విచక్షణుల్ నీతి శాస్త్రంబని,
కవి వృషభులు మహాకావ్యమనియు,
లాక్షణికులు సర్వలక్ష్య సంగ్రహమని,
యైతిహాసికు లితిహాసమనియుఁ,
బరమ పౌరాణికుల్ బహు పురాణ సముచ్చ
యంబని......................."

—ఆది-1-32

ఇల్లా ఎవరిమట్టుకు వారే ఇది తమకు ప్రమాణ గ్రంథం అనుకొంటారు. ఇంతే గాదు ఎవరెవరికి అభిప్రాయభేదాలున్నా వాటన్నిటినీ సమన్వయించి, ఒక విష యాన్ని నిష్కర్షచేసి చెప్పేదికూడా ఈ గ్రంథమే అని అన్నారు.

"వేదములకు నఖిలస్మృతి
వాదములకు బహుపురాణ వర్గంబులకున్
వాదైన చోటులను దా
ఘూదల ధర్మార్థ కామమోక్ష స్థితికిన్."

—విరాట-1-4

అంటే, అనేక విషయాల్ని తీర్థానికి తీర్థం ప్రసాదానికి ప్రసాదం అన్నట్లు కాకుండా, అనేక ప్రామాణిక గ్రంథాల్లో – స్థూలదృష్టితో చూస్తే – కనపడే వైరుధ్యాన్ని తొలగించి సమన్వయాన్ని సాధించి, ఏక వాక్యతను సమకూర్చే గ్రంథరాజం ఇది అని పెద్దల నిర్ణయం. దీనికి ఇంత ప్రశస్తి దేన్నిబట్టి వచ్చింది అనే ప్రశ్న ఉదయిస్తుంది.

ఏ గ్రంథం రచించినా, ఆ గ్రంథకర్తయొక్క పాండిత్యాదులు అందులో ప్రతిఫలిస్తాయి అనేది సత్యం. ధర్మాద్వైత మూర్తిఅయిన వ్యాసుడు భారతాన్ని శాస్త్రేతిహాసంగా తీర్చిదిద్దాడు. దీంట్లో ఆ మహామనీషి వేదసారాన్నిఅంతా పిండి మన కందించాడు.

"వేదోప బృంహణార్థాయ"–వేదాల్లో ప్రవచించినవాటినే, బాగా మనస్సుకు హత్తుకొనేటట్లు ప్రపంచించి చెప్పుతానన్నాడు. వేదాలను విశ్లేషణచేసి ఆ నాటివారికి అందించిన వేదవ్యాసుడు ఈ పనికి పూనుకోడం అనేది సముచితమైనదికూడా.

ఏతావతా, భారతం భారతీయ విజ్ఞాన సర్వస్వమనీ, విజ్ఞాన సర్వస్వమే కాదు, అది విజ్ఞాన సమన్వయం చేసిందనీ, విజ్ఞాన సమన్వయం చేయడమేగాదు, సాక్షాత్తు వేదమేననీ, పెద్దల నిశ్చితాభిప్రాయం. అందుకనే ఇది పంచమ వేదమయింది.

ఈ పసిడికొండను తవ్వి తెలుగువారి తలకెత్తిన మహాపురుషులు -- ముగ్గురు మహా మనీషులు – నన్నయ, తిక్కన, ఎర్రనలు. వీరు ఈ మహా కార్యానికి ఎందుకు పూనుకోవలసి వచ్చింది?

పెద్దలకు రెండు దృష్టులు ఉంటూ ఉంటాయి. ఏదేనా కొత్తది చెబితే బాగుండును, అని ఒకటీ; కొత్తదేదేనా చెప్పడం మంచిదేగాని, కొత్తదానికంటె, చెప్పవలసినదాన్ని చెప్పాలి అనేది రెండవది. "చాలా గొప్పగొప్ప విషయాలు మనం తెలుసుకొన్నాం; మనవాళ్లకుకూడా వాటిని చెప్పాలి" అనే సంకల్పం చాలా గొప్పది. మన పూర్వుల్లో చాలా మందికి కొత్తది చెప్పాను అనే ప్రశంసాపత్రం పుచ్చుకొనే దృష్టి కంటే, చెప్పి తీరవలసినవి చెబుతాను' అనే దృష్టి ఉండేది. పైగా వారు "అయ్యా! ఇదంతా నా సొంతం; దీనిమీద సర్వస్వామ్యాలూ నావి," అని అనేవారు కాదు. తాము తమ పెద్దలు చెప్పిన విషయాలనే చెబుతున్నామన్నారు; తమ సొంతం కాదన్నారు. తర్వాత వారు దీన్ని వాడుకోరాదు అని కట్టడి వారు చెయ్యలేదు. లేకపోతే వ్యాసుడులాంటి 'మౌలికమైన రచనలు' చేసిన మహా పురుషుడు ఇదంతా వేదాల్లోని విషయమేనయ్యా అనవలసిన అవసరం ఏముంది?

మన ముగ్గురు మహామనీషులు నన్నయ, తిక్కన, ఎర్రనలది ఇటువంటి ప్రాచీన దృష్టే; కొత్తదేదీ సృష్టిచేయగల శక్తి లేకపోవడంవల్ల కాదు వారు భారతాన్ని తెలుగులో చెప్పింది. అయితే ఒక మహాకార్యం చెయ్యాలంటే, కాలం కలిసి రావాలి. స్వశక్తితో బాటుగా, ప్రభుశక్తి ప్రోత్సాహాలు కలిసివస్తే పని మరింత చురుకుగా కొనసాగుతుంది. అట్లాంటిదే నన్నయకు లభించింది.

మనుమార్గవర్తనుడైన రాజరాజనరేంద్రుడు పెద్ద సభలో సుఖాసీనుడై ఉండి నన్నయతో ఇలా అన్నాడు :

"విమల మతిం బురాణములు వింటి ననేకము లర్థ ధర్మశా
స్త్రముల తెఱంగెఱింగితి నుదాత్త రసాన్విత కావ్యనాటక
క్రమములు పెక్కు సూచితి జగత్పరి పూజ్యములైన యీశ్వరా
గమముల యందు నిల్పితిఁ బ్రకాశముగా హృదయంబు భక్తితోన్."

అయినను నా హృదయంబు ననవరతంబును శ్రీ మహా భారతంబు నందలి యభిప్రాయంబు విన నభిలాష పెద్దయై యుండు" (ఆది. 1. 10–11) అని అన్నాడు.

అన్నది రాజు ; విన్నది మహత్సభలో. సభలో నున్నవారా ! "అపార శబ్ద శాస్త్ర పారగులైన వైయాకరణులును, భారత రామాయణాద్యనేక పురాణ ప్రవీణులైన పౌరాణికులును, మృదు మధుర రస భావ భాసుర నవార్థ వచన రచనా విశారదులయిన మహా కవులును, వివిధ తర్క విగాహిత సమస్త శాస్త్ర సాగర సార గరీయః ప్రతిభులైన తార్కికులును." అంతటి సభలో నన్నయ్యతోనే ఎందుకు భారత ప్రసక్తి తేవలసి వచ్చింది? నన్నయ్య తన కులబ్రాహ్మణుడు, అనురక్తుడు. ఇంత మాత్రంచేతనే ఏదైనా మహాకార్యాన్ని గురించి మాట్లాడి పని చేయించుకొంటే అది ఆశ్రిత పక్షపాతం అవుతుంది. మరి నన్నయ్యతో, అంటే—

"..........అవిరళ
జప హోమ తత్పరు విపుల శబ్ద
శాసను సంహితా భ్యాసు బ్రహ్మాండాది
నానా పురాణ విజ్ఞాన నిరతు" నితో

మాట్లాడాడు. అతడు సద్వంశ తావదాత చరితుడు, లోకజ్ఞుడు, ఉభయ భాషా కావ్యరచనాభి శోభితుడు, సత్కవితాభి యోగ్యుడు, నిత్య సత్యవచనుడు, మత్యమరాధిపాచార్యుడు, సుజనుడు. ఈ విశేషణాల్లో నన్నయ సౌశీల్యం, సామర్థ్యం – రెండూ – అంటే, వ్యక్తిత్వం వెల్లడవుతోంది. ఇందులో ఉండే ఉభయ భాషా కావ్యరచనాభి శోభితుడు అన్నది ఒక విలువైన మాట. ఆయన అంతకు పూర్వమే సంస్కృతాంధ్రాల్లో కావ్యాలు వ్రాసి కీర్తివహించాడు. కాగా ఆంధ్ర మహాభారతం తొలి తెలుగు కబ్బంకాదని స్పష్టమవుతోంది. ఇంకెవరెవరి ప్రసక్తీ మన కక్కర లేదు. నన్నయ్యే భారత రచనకు పూర్వం కొన్ని తెలుగు కావ్యాలు (అధమం ఒక్కటైనా) రచించి ఉండాలి అనేది నిశ్చయం. రచనాభ్యాసం గల నన్నయ్యను, భారతం రచింపుమని రాజరాజనరేంద్రుడు అన్నాడు. అయితే దీనికి ఒక నియమం ఏర్పాటు చేశాడు. ఒక్క సంస్కృతంలోనే గాదు, భారత కథ ఇంకా అనేక భాషల్లో రాజు ఇంతకు పూర్వమే వినియున్నాడు. కాని దేశభాషల్లో అవైదిక భావాలకు అనుగుణంగా, వ్యాసుని మనస్సుకు దూరంగా భారత రచన సాగింది.

రాజు కోరుకొన్నది అదిగాదు. వ్యాసులవారు ఏ గొప్ప ఆశయంతో భారతాన్ని వ్రాశారో, ఆ ఉద్దేశ్యం ప్రస్ఫుట మయ్యేటట్లు వ్రాయాలి. అనాడు ఉండే భాషా కావ్యాల్లో ఉన్న అవ్యవస్థ నుంచి భారతాన్ని వెలికి తీయాలి. కనుకనే అధిక ధీయుక్తితో ఈ కార్యం నెరవేర్చాలి. అందుకనే, రాజు ఇల్లా అన్నాడు :

"జన నుత కృష్ణ ద్వైపా
యన ముని వృషభాభిహిత మహాభారత బ
ద్ధ నిరూపితార్థ మేర్పడ
దెనుఁగున రచియింపు మధిక ధీయుక్తి మెయిన్."

—అది.1–16

అయితే ఈ మహాకార్యాన్ని నిర్వహించడం "విధాతృనకైనను నేరబోలునే," అని వినీతుడైన నన్నయ్య ప్రశ్నించుకొన్నాడు. ఒక మహాకావ్య రచనకు అనువైన భాషను మలచుకోవాలి; ఛందస్సును నిర్ణయించు కోవాలి; పెద్దలు మెచ్చేటట్లు మహా కావ్యానికి ఒరవడి దిద్దాలి. ఈ మహా కార్యంలో అతనికి చేదోడు వాదోడుగా నారాయణభట్టు నిలబడ్డాడు. నారాయణభట్టూ తానూ కలిసి చదువుకొన్నారు. మంచి మిత్రుడు. పైగా వాఙ్మయ ధురంధరుడు. అతనంటే నన్నయకు ఎనలేని అభిమానమూ, గౌరవమూ. అర్జునుడికి, శ్రీకృష్ణుడిలాగా తనకు నారాయణభట్టు తోడ్పడ్డాడట. ఇకనేమి? నరనారాయణుల వంటి నన్నయ నారాయణుల సమర్థత వల్ల ఆంధ్ర మహాభారతం అనర్ఘంగా అవతరించింది.

"వివిధ తత్త్వవేది, వేదవ్యాసుఁడు"
"విశ్వజనీనమై పరఁగు చుండఁ"

భారతాన్ని రచించాడు. దాన్ని జగద్ధితం కొరకు నన్నయ తెలుగులోకి తెచ్చాడు. తన కవిత్వంలో మూడు ముఖ్య లక్షణాలు ఉన్నాయన్నాడు నన్నయ :

"సారమతిం గవీంద్రులు ప్రసన్నకథా కలితార్థ యుక్తిలో
నారసి మేలునా నితరు లక్షర రమ్యత నాదరింపనా
నా రుచిరార్థ సూక్తి నిధి నన్నయభట్టు తెనుంగునన్ మహా
భారత సంహితా రచన బంధురుఁడయ్యె జగద్ధితంబుగాన్"

—అది. 1–26

(1) తన ప్రసన్న కథా కలితార్థయుక్తిని చక్కగా వివేచించి మంచి మనసు గల కవిపుంగవులు మెచ్చుకొంటారు; (2) తన కవిత్వంలో అక్షరమయమైన, అక్షరమైన రమ్యత ఉంటుంది; (3) తాను నానా రుచిరార్థ సూక్తినిధి. ఇది ఈ పద్యంలోని భావం.

మహాభారతం వేదమే అని, సంహితాశబ్దాన్ని వాడాడు నన్నయ. ఈ సంహిత లోని కథను సుప్రసన్నం చెయ్యాలి. "అనగనగా ఒక రాజు, ఆ రాజు కేడుగురు

కొడుకులు" అని చెప్పడంతోటే చిన్నపిల్లలకు కూడా కథ స్పష్టమవుతోంది. ఇల్లా కథలు చెప్పడంకాదు. సంహితలోని కథ పండిత కవులు మెచ్చేటట్లు చెప్పాలి. అక్షర రమ్యత, అంటే, క్షరముగాని రమ్యత, లేక, శ్రుతి సుభగతగల రచన. ఇది రచన అందాన్ని పెంపొందిస్తుంది. వేదతుల్యత ఉండాలంటే, నీతి బోధ కూడా ఉండాలి. ఆతడు సుద్దుల పెద్ద. మహాకావ్య లక్షణాలుగల గ్రంథం తెలుగు భాషలో రావాలని సంకల్పించు కొన్నాడు నన్నయ్య.

"గాసట బీసటే చదివి గాథలు త్రవ్వ" తెలుగువారికి మహెూత్తమమైన కథ వినిపించాలి. లౌకిక వ్యావృత్తులతో సతమతమవుతూ ఉన్న తెలుగువారికి అలౌకిక భావసంపన్నమైన లౌకిక కథనే వినిపించాలి. దానికి కావ్యత్వం కల్పించి అలౌకి కానందాన్ని సమకూర్చాలి.

నన్నయ్య ఇందులో కృతకృత్యు డయ్యాడు.

మహాభారతం సంస్కృతంలో మహెూత్తమ కథా సమన్వితం; అనేక శాస్త్ర విషయ సంభరితం. అయితే, అనేక పర్యాయాలు విపులమైన శాస్త్ర చర్చల్లో కథ తెరచాటుకు వెళ్లిపోతుంది. నన్నయ్య శాస్త్ర విషయాలు చెప్పలేదనిగాదు. కాని వాటి వైపుల్యాన్ని వీలైనంత తగ్గించి శాస్త్రేతిహాసాన్ని కావ్యేతిహాసంగా మార్చడానికి ప్రణాళిక వేసుకొన్నాడు. సంస్కృతంలో భారతానికి కావ్యత్వం లేదనిగాదు. ప్రాధాన్య వివక్షవల్ల తేలేదేమిటంటే, భారతం సంస్కృతంలో కావ్యత్వాన్ని సంతరించు కొన్న మహాశాస్త్రం; తెలుగులో శాస్త్రత్వాన్ని నిలుపుకొన్న మహాకావ్యం.

నన్నయ్యది ప్రసన్న గంభీరమైన రచన. పరస్పర విరుద్ధాలుగా కనపడే ఈ లక్షణాలు మహాకవుల రచనలో కనపడతాయి. స్థూలంగా చూస్తేనే, పద్యం బోధపడుతుంది. అయితే, లోనారసి చూస్తేగాని అందులోని పూర్తి సొగసు అర్థం గాదు. ఈ విషయాన్ని స్పష్టం చెయ్యడానికి ఒక చిన్న ఉదాహరణ—ప్రసిద్ధమైనదే తీసుకొందాం: యయాతి దేవయానిని నూతి నుంచి వెలువరించాడు. సంస్కృతంలో వ్యాసుడు ఒక శ్లోకంలో ఇల్లా అన్నాడు:

"తామథో బ్రాహ్మణీం రాజా
విజ్ఞాయ నహుషాత్మజః
గృహీత్వా దక్షిణా పాణా
వుజ్జహార తతోఽవటాత్"

(దేవయాని బ్రాహ్మణ కన్యక అని తెలుసుకొని కుడిచెయ్యి అందించి, ఎంతో జాగర్తగా యయాతి ఆమెను పైకి లాగాడు.)

దీనికి నన్నయ్య వ్రాసిన పద్యమిది:

"జలధి విలోల వీచి విలసత్కల కాంచి నమంచి తావనీ
తలవహన క్షమంబయిన దక్షిణ హస్తమునం దదున్నమ

ధ్గళదురు షర్మవారికణ క్రమకరాబ్జము వట్టి నూతిలో
నెలువడఁ గోమలిం దిగిచె విశ్రుతకీర్తి యయాతి ప్రీతితోన్"

—ఆది. 3–144

భూభారాన్ని వహించే దక్షిణ హస్తంతో దేవయానిని పైకి లాగాడు. ఆమె కూడా తన చెయ్యి పైకెత్తింది. స్థూలంగా చూస్తే ఇదీ విషయం.

కాని ఇందులో ఉన్న పదాలు ఎంత సార్థకమైనవి! భూమిని స్త్రీగా పోల్చాడు కవి. జలధి విలోల వీచి విలసత్ కలకాంచి సముంచితావనీతలం అనడంవల్ల కాంచీ షలం షలలు వినిపిస్తున్నాయి. భూదేవిని ముందే చేపట్టినాడు యయాతి. దేవయాని చెయ్యి స్వేదబిందువులతో మనోహరంగా ఉంది; ఇప్పుడు ఈ కోమలిని చేపట్టినాడు. ఏదో పాపం అని గాదు, ప్రీతితో చేపట్టినాడు. అయితే, ఈ చేపట్టడం అతని కీర్తికి భంగం కలుగజేసేది మాత్రం కాదు అని విశ్రుతకీర్తి అన్నాడు. మున్నుచేపట్టిన భూదేవితో బాటు దేవయానిని గూడా చేపట్టడంవల్ల ఇతడు దక్షిణ నాయకుడు కాగలడు అనే స్ఫురణను కలుగజేశాడు కవి. ఉత్తరోత్తరా కాబోయే శర్మిష్ఠా వివాహన్ని ఇతని దక్షిణ నాయకత్వం సూచిస్తోంది. ఈ పద్యంలో శృంగారం తొంగి చూస్తోంది.

ఇల్లాగే, మూలంలో చిన్నమాట ఉంటే, సందర్భాన్నిబట్టి పెంచి వ్రాసుకోడం నన్నయ అలవాటు. చిన్న ఉదాహరణ ఒకటి తీసుకొందాం :

శిశుపాలుడు సభలోంచి బయటికి పోగానే అతని సేనాధిపతి సునీథుడు సైన్యాన్ని సమాయత్తం చేశాడు. ఏమయిపోతుందో అని వాళ్లందరికీ నచ్చజెప్ప మని భీష్ముణ్ణి ధర్మజుడు కోరాడు. అప్పుడు

"………కడుఁ బెక్కులయ్యుఁ గుక్క
లిభకుంభ దళన మహిష్ఠ నిష్ఠుర నఖ
ముఖుడగు హరిమీద మొఱిఁగి యేమి
సేయనోపు………"

—సభా. 2–38

"ఏనుగు కుంభస్థలాన్ని చీల్చేసే శక్తి గల్గిన సింహం మీద ఎన్ని కుక్కలు మొరిగితేనేమి?" అని అన్నాడు భీష్ముడు. సింహ శబ్దానికి 'ఇభకుంభ దళన మహిష్ఠ నిష్ఠుర నఖముఖుడగు హరి' అని ద్రాఘిష్ఠమైన సమాసం వేశాడు. తెలుగులో ఏనుగును చూచి కుక్కలు మొరగడం అనే సామెత ఉంది. కాని ఇక్కడ ఏనుగును చంపే సింహం యొక్క శక్తిని సూచించాడు కవి. దీంతో సింహం, గ్రామసింహం రెండూ వచ్చాయి. అయితే, మూలంలో సింహ, శ్వాన శబ్దాలు లేకపోలేదు. అయినా, తెలుగు సామెత స్ఫురించేటట్లు సింహశక్తి నిరూపిత మయ్యేటట్లు నన్నయ్య వ్రాయడంలో విశేషం ఉందని అంగీకరించాలి.

శర్మిష్ఠ కుమారులు తండ్రి సమీపంలో ఆడుకొంటున్నారు. వాళ్ళని దేవయాని చూచింది. ఆ పిల్లలు దేవతల్లాగా ఉన్నారు.

"దదర్శచ తదాతత్ర కుమారాన్ దేవరూపిణః
క్రీడమానాన్ సువిస్రబ్ధాన్ విస్మితా చేద మబ్రవీత్"

మూలంలో అల్లా ఉంది. అయితే, నన్నయ్య దాన్ని ఎల్లా పెంచాడో చూడండి :

"కరువలిచేఁ దూలు కపిల జటాలియ
కరమొప్ప శిఖలుగాఁ గనకరత్న
మయజాల భూషణాపుల దేహదీప్తుల
తేజంబుగాఁ బ్రవిదీప్య మాన
యాగ శతంబున నర్చితంబైన మూఁ
డగ్నులు ప్రత్యక్షమైన యట్లు
తన క్రోల శర్మిష్ఠ తనయులు క్రీడించు
చుండంగ నున్న యయ్యుర్విరేని
కడకు నేగుదెంచె........."

—ఆది. 3–182

ఈ వర్ణనలో (దేవరూపులైన) ఆ బాలకులు మూడగ్నుల వలె నున్నారని చెప్పి వైదిక మార్గనిష్ఠమైన యాగాగ్నులను కన్నులకు గట్టినట్లు చేసినాడు కవి. దీంతో కవి యొక్క నిష్ఠాగరిష్ఠ జీవనం కూడా మన మనసుల్లో మెదులుతుంది.

నన్నయ్య కేవలానువాదకుడు కాడని పరిశీలిస్తే తెలుస్తోంది. ఆయన రచన లోని ధారాళత ఎట్టివారినైనా ఆకర్షిస్తుంది. ఆ ధారాళత అది అనువాదం అనే స్ఫురణనుగూడ తొలగజేస్తుంది.

"అయస్తు పురుషోబాలః
శిశుపాలో నబుద్ధ్యతే"

ఈ శిశుపాలుడు చిన్నవాడు ; ఏమీ తెలియదితనికి అనిమూలంలో ఉన్నదాన్ని

"పాలిత దుర్నయుండు శిశుపాలుఁడు బాలుఁడు వీనినేల భూ
పాలక నీకుఁబట్టు పరుపన్ మఱి ధర్మువెఱుంగ వీనికిం
బోలునె రాగకోప పరిభూత మనస్కున కల్పరాజ్య ల
క్ష్మీ లలనాంధ బుద్ధి కనిమిత్త మహత్పరివాద శీలికిన్"

—సభా. 2–22

నన్నయ్య పలుకుల్లో గాంభీర్యం ఎల్లాఉందో! ఒక మహారాజు కావలసినవాడు, మహారాజులను తీర్చిదిద్దినవాడు, మహారాజులందరికీ మాన్యుడైనవాడు భీష్ముడు. ఆతని పలుకులు వింటూఉంటే, వృద్ధ సింహరాజము మాట్లాడినట్లే ఉంటుంది. ఆ బిగువైన సమాసాలు మనకు వెంటనే బోధపడతాయి. మహావీరుడు మాట్లాడే

టప్పుడు మాటల్లో మెలికలుండవు. సూటిగా ఘాటుగా ఉంటాయి. అల్లాగే ద్రౌపదీ వస్త్రాపహరణ ఘట్టంలో భీముడి పలుకులు వాడిగా వేడిగా ఉన్నాయి:

"కురువృద్ధుల్ గురువృద్ధ బాంధవులనేకుల్ సూచుచుండన్ మదో
ద్ధురుఁడై ద్రౌపదినిట్లు సేసినఖలున్ దుశ్శాసనున్ లోకభీ
కర లీలన్ వధియించి తద్విపుల వక్షశ్శైల రక్తౌఘ ని
ర్ఘర ముర్వీపతి చూచుచుండ నని నాస్వాదింతునుగ్రాకృతిన్"

—సభా. 2-223

అన్న పద్యమూ

"ధారుణి రాజ్యసంపద మదంబునఁ గోమలిఁగృష్ణఁజూచి రం
భోరు నిజోరు దేశమున నుండఁగఁ బిల్చిన యిద్దురాత్ము దు
ర్వార మదీయ బాహు పరివర్తిత చండగదాభిఘాత భ
గ్నోరు తరోరుఁ జేయుదు సుయోధను నుగ్ర రణాంతరంబునన్"

—సభా. 2–249

అన్న పద్యమూ ఓజోగుణ ప్రధానమైనవి. ఇల్లాంటి పద్యాలన్నీ తర్వాత తర్వాత నాటకాలు రచించిన వారందరికీ ఒరవడి దిద్దాయి. అయితే, నన్నయ్యా పద్యాల్లో ఎక్కడా కృతకాలుకాని అనుప్రాసలు ఉంటాయి. కంటినికప్పే కాటుక కూడదు గదా!

నన్నయ్య ఒకటిరెండు మాటల్లోనే భావాన్నంతనీ వ్యక్తంచెయ్యగల నేర్పరి కూడా. ధర్మజాదులు లక్కయింటి మంటల్లో మలమల మాడిపోయారని వార్త వచ్చింది ధృతరాష్ట్రుడికి; దుఃఖం పట్టలేని 'అ ధృతరాష్ట్రుఁ డావఱచినట్లఱచెన్ వివిధ ప్రలాపుఁడై' అన్న ఒక్కమాటా ధృతరాష్ట్రుడి దుఃఖం అంతా వ్యక్తం చేస్తోంది.

నన్నయ్య సంస్కృతమయంగా తెలిగించాడు అని అనేకుల భావన. అయితే నన్నయ్య సంస్కృతపదాలు తక్కువగా ఉన్న ఎన్నో తెలుగు పద్యాలు వ్రాసినాడు. ఉదా.:

"తగునిది తగదని యెదలో
వగనక సాధులకుఁ బీదవారల కెగ్గుల్
మొగిఁజేయుఁ దుర్వినీతుల
కగు ననిమిత్తాగమంబులయిన భయంబుల్ అది. 1-86

ఏల యెఱుకలేని యితరుల యట్ల నీ
వెఱుఁగననుచుఁ బలికె దెఱిఁగి యెఱిఁగి
యేనకాని దీనినెఱుఁగ రింకొరులని
తప్పఁ బలుకనగునె ధార్మికులకు"

–అది. 4–79

నన్నయనుగురించి మరొక అపోహ ఉంది. ఆయన మడిగట్టుకొని వ్రాస్తాడని. కావ్యరచనకూడా దైవారాధనగానే పూర్వులు భావించుకొనేవారు. అయితే, నన్నయ్య చాదస్తుడుగాదు. సునిశితమైన హాస్యం నన్నయ్య రచనలో అక్కడక్కడ కనిపిస్తుంది. ఒక ఉదాహరణ :

ద్రోణుణ్ణి అవమానపరచిన ద్రుపదుణ్ణి, ద్రోణ శిష్యుడు అర్జునుడు బంధించి ద్రోణుడిదగ్గర గురుదక్షిణగా పడవేస్తాడు. అప్పుడు ద్రోణుడు

"వీరెవ్వరయ్య ద్రుపద మ
హారాజులె యిట్లు కృపణులయి పట్టువడన్
వీరికి వలసెనె యహహ మ
హారాజ్య మదాంధకార మది వాసెనొకో"

—ఆది. 6–90

"ఇంకనైన మమ్ము నెఱుగంగ నగు నొక్కొ......" అన్నమాటలు, రాజ్య మదాంధకారంతో కొట్టుమిట్టాడిన ద్రుపదుడికి గుండెల్లో గాలంమాదిరిగా ఉన్నాయి; మనకుమాత్రం చక్కని ఉల్లాసం కలుగుతుంది.

ఇక నన్నయ్య నానా రుచిరార్థ సూక్తినిధిగదా! సూక్తి అనగానే నీతి పద్యాలు వరుసపెట్టి చెప్పేశాడు అని గాదు. లెస్సఅయిన మాటఅని అర్థం. కవితారీతిలో పైనచెప్పినవన్నీ సూక్తులే. అయితే, నేరుగా నీతిబోధ చేస్తే అది సూక్తి కాకపోదు. అల్లాంటివి ఒకటిరెండు ఉదాహరణలు.

"తల్లిపనిచె నని యధర్మువు సేయంగనగునె"
"గతకాలమె మేలువచ్చు కాలముకంటెన్"

ఇల్లా నన్నయ్య భారతాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నం చేశాడు. అయితే, దురదృష్టవశాత్తు ఆయన ఈ కృషిని తుదముట్ట కొనసాగించలేకపోయాడు. ఆయన ఆదిసభా పర్వాలు పూర్తిచేసి అరణ్యపర్వం దాదాపు సగం పూర్తిచేశాడు. తర్వాత అనువాద కార్యక్రమం ఆగిపోయింది. దురదృష్ట పిశాచి మనల్ని రెండు శతాబ్దాలు పీడించింది.

అయితే, ఆంధ్రుల అదృష్టంవల్ల తిక్కన భారతాంధ్రీకరణ మొదలుపెట్టాడు. తిక్కనవంటి కవి మనలో జన్మించడం మనకు గర్వకారణం.

తిక్కన భారతాంధ్రీకరణకు పూర్వం కొంత రాజసంగల కవిలా తోస్తాడు. ఉత్తర రామాయణ రచనాకాలంనాటికి ఆయన ఇల్లా తననుగురించి వ్రాసుకొన్నాడు:

"అమలోదాత్త మనీష నే నుభయ కావ్యప్రౌఢి పాటించు శి
ల్పమునం బారగుఁడన్ గళావిదుఁడ......"

రజోగుణం కలిగినవాడు, అంటే, వట్టి డాబులు పలికేవాడు అనికాదు అర్థం. తన

విషయాన్నిగురించి, మొహమాటం లేకుండా మాట్లాడగలిగినవాడని తిక్కన విషయంలో అనుకోవచ్చును.

పై పద్యంలో ఉభయ కావ్యాల ప్రసక్తి తీసుకొని వచ్చాడు. ఉభయకావ్యాలు అంటే శ్రవ్య కావ్యాలూ, దృశ్యకావ్యాలూ. ఈ రెండురకాల కావ్యాల్లోనూ శిల్పంలో తేడా ఉంటుందిగదా? అయితే, తిక్కన ఈ రెండింటిలోనూ అవలీలగా ఈదిన వాడు. ఇంతేగాదు శ్రవ్య కావ్యంలోనే దృశ్యకావ్యపు సొగసులుకూడా తీసుకు రాగలిగినవాడు. అస లుభయకావ్యాలంటే సంస్కృతాంధ్ర కావ్యాలనీ అర్థం చెప్పుకో వచ్చు. ఆయనను కేతన 'ఉభయకవి మిత్రు'డన్నది అందుకేగదా!

సరదాకోసమో, పట్టుదలకోసమో, పోటీకోసమో ఉత్తరరామాయణం వచన రహితంగా తిక్కన రచించాడు; కవితా ధర్మాన్ని, కావ్యలక్షణాలనీ వరుసబెట్టి ఏకరువు పెట్టాడు; కుకువులను నిందించాడు; కావ్యాన్ని తన్నేలిన రాజుకు అంకిత మిచ్చాడు. ఇవన్నీ కొంచెం కుడియెడంగా మన కవులందరూ చేసినవే. తిక్కన యొక్క ఎదుగూ బొదుగూ దీనితోనే ఆగిపోతే, అతణ్ణిగురించి మనం ఇంతగా అనుకోవలసిన అవసరమే లేదు.

భారత రచననాటికి సోమయాజియై తిక్కన పూతుడైనాడు. తాను తొల్దొలుత శివభక్తుడయినా, భారత రచన నాటికి హరిహరమూర్తిని ఆరాధించడం మొదలు పెట్టాడు. హరిహరుడు సకల బ్రహ్మము అని బావించి "తత్ప్రసాదాసాదిత కవిత్వ తత్త్వ నిరతిశయానూ భవానంద భరితాంతః కరణుండ" ననుకొన్నాడు. భారతేతి హాసరచనాకాలంనాటికి ఉత్తరరామాయణ రచననాటి అహంభావము పూర్తిగా తొలగి పోయి 'నానేర్చిన భంగి చెప్ప వరణీయుండనయ్యెద భక్తకోటికిన్,' అని వినీతుడై చెప్పుకొన్నాడు. తన గొప్పదనమేదీలేదని, తాను విరాజిల్లేది బుధారాధనవల్లనే అని 'బుధారాధన విరాజి'నని చెప్పుకొన్నాడు.

కావ్య రచనను పరమేశ్వర సన్నిధానంలో వినిపించడం అదొక ఆరాధనా విశేషంగా భావించికొని, ఆ భావంతోనే మహాభారత రచన కొనసాగించాడు. 'ఈ ప్రబంధ మండలి కధినాథునిగా నేపురుషుని బేర్కొనువాడనొ' అననదికూడా వేదతుల్యములైన దివ్య ప్రబంధాలను మనస్సులో ఉంచుకొని అన్నమాట కావచ్చును. తాను తన నివేదనను ఆ హరిహరమూర్తికే కావించినాడు. శివకేశవాభేదమైన ఈ మూర్తి

"కరుణా రసము పొంగి తొరఁగెడు చాడ్పున
        శశిరేఖ నమృతంబు జాలు వాఱ
హరినీల పాత్రిక సురభిచందనమున
        గతి నాభిధవళ పంకజము మెఱయ
గుఱియైన చెలువున నెఱసిన లోకర
        క్షణ మనంగ గళంబు చాయ దోఁప

బ్రథమాద్రిఁదో తెంచు భానుబింబమునాను
రమ్మునఁ గౌస్తుభరత్న మొప్ప
సుర నదియును గాళిందియు బెరసి నట్టి
కాంతిపూరంబు శోభిల్లు శాంతమూర్తి"

—విరాట. 1–12

తనకు ఒకనాడు స్వప్నంలో సాక్షాత్కరించాడు. భారతాన్ని తెలుగులోకి తీసుకొని వద్దామను కొంటూ ఉండగా ఈ కల వచ్చింది. ఆ భారతం

తెనుఁగు బాస వినిర్మింపఁ దివురు టరయ
భవ్య పురుషార్థ తరుపక్వ ఫలముగాదె
దీని కెడ నియ్యకొని వేడ్కనూని కృతి ప
తిత్వ మర్థించి వచ్చితిఁ దిక్కశర్మ"

—విరాట. 1–18

అని ఆ దేవదేవుడే కోరడంతో, ఆతడు భక్త సులభుడని యెరిగి, తాను మడి మాన్యము లడుగలేదు. 'ఇంక జన్మాంతర దుఃఖముల్ తొలఁగు నట్లగఁజేసి సుఖాత్ము జేయవే' అని అర్థించాడు. ఆతడు వల్లె అన్నాడు.

తిక్కన అనువాదానికి భారతాన్నే ఎందుకు ఎన్నుకొన్నాడు?

తిక్కన యొక్క హరిహరాద్వైతం, ధర్మాద్వైతంలో అంతర్భాగమే, 'ధర్మాద్వైత' నిరూపక గ్రంథము భారతం, అది 'లేఖ్యంబైన ఆమ్నాయము.' దానిని 'ఆంధ్ర కవిత్వ విశారదుండు,' 'విద్యా దయితుండు' అయిన నన్నయ్య ప్రారంభించినా అది పూర్తి కాలేదు.

"కావున భారతామృతము గర్ణపుటంబుల నారఁగ్రోలి యాం
ధ్రావళి మోదముం బొరయునట్లుగ సాత్యవతేయ సంస్కృతి
శ్రీ విభవాస్పదంబయిన చిత్తముతోడ మహా కవిత్వదీ
క్షావిధి నొంది పద్యముల గద్యములన్ రచియించెదం గృతుల్.

విరాట. 1–30

బెట్టులు, పట్టింపులు లేని బుద్ధితో నన్నయ్యలాగానే తానూ గద్య పద్యోభయంగా భారతాన్ని రచిస్తానన్నాడు. తాను గూడా వ్యాసుల వారి భావాలనే మనస్సులో పెట్టుకొని అనువదిస్తా నన్నాడు. కవిత్వమేదో అలవోకగా వ్రాసేది గాదు, అది 'మహా కవిత్వ దీక్షా విధి' అన్నాడు. భారతం వినడం వల్ల ఆంధ్రు లంతా ఆనందాన్ని పొందుతారని అన్నాడు. వింటే భారతమే వినాలి అని గదా!

"కథ జగత్ప్రసిద్ధగావునఁ బూర్వప
ర్వార్థ యుక్తి సేయునట్టి యెడల
యత్న మించు కంతయైనను వలపదు... .."

—విరాట. 1–42

అని తిక్కన విరాటపర్వ కథను వెంటనే కొనసాగించాడు. విరాటపర్వాన్ని గురించి,

"హృదయాహ్లాది చతుర్థ మూర్జిత కథో పేతంబు నానా రసా
భ్యు దయోల్లాసి విరాటపర్వము.........."అన్నాడు.

అయితే, విరాటపర్వమేగాక, మిగిలిన పర్వాలన్నీ తిక్కన మిక్కిలి సమర్థతతో నిర్వహించాడు; చక్కని 'రసపట్టులు' ఈయన రచనా భాగంలో ఎక్కువగా ఉన్నాయి. ఎన్నో ఘట్టాల్లో తన రచనా సామర్థ్యాన్ని చూపుకోడానికి తిక్కనకు అవకాశం లభించింది.

తిక్కన్నది 'రసాభ్యుచిత బంధమనీ,' 'అతడు శిల్పంపు తెనుఁగుఁ దోట' యనీ ఉద్దండ పండిత కవుల తీర్పు – ఈ రెండు విషయాలను గురించి స్థూలంగా పరిశీలిద్దాం.

భారతం శాంత రస ప్రధానమని అలంకారిక నిష్కర్ష. ఏ కావ్యంలోనైనా ప్రధాన రసాన్ని అంగి రసమనీ, దాని కంటె తక్కువ ప్రధానాలైనవీ, దానికి బలాన్ని చేకూర్చేవీ అంగ రసాలు అనీ స్థూలమైన వివరణ.

మహా భారతయుద్ధం తర్వాత ధర్మజుడు మనస్సులో మథన పడడం మొదలు పెట్టాడు. అతనికి భీష్ముడు చేసిన నీతిబోధలతో శాంత్యాను శాసనిక పర్వాలు నిండి ఉంటాయి. యుద్ధం తర్వాత అతనిలో కలిగిన నిర్వేదం శాంతిగా మారింది. ఆ తర్వాత ఏ యే విషయాలు వచ్చినా అన్నీ శాంతంలోనే పర్యవసించాయి. తిక్కన్న పరమ శాంతుడయి రచించిన రచన గనుక, ఆయా పర్వాంతాల్లో హరిహర నాథుణ్ణి స్తుతిస్తూ ఆనంద శబ్దాన్ని వాడినాడు. శాంతుడికి గలిగే ఆనందం బ్రహ్మానందం ; కావ్య పఠనంలో సహృదయుడికి కలిగేది బ్రహ్మానంద సబ్రహ్మచారి అయిన రసానందం. ఏతావతా, తిక్కనకు బ్రహ్మానందమూ, మనకు (శాంత) రసానందమూ లభించాయి.

తిక్కన రచన రాశిలో చూచినా, వాసిలో చూచినా గొప్పదే. అతడి విరాటోద్యోగ పర్వాల రచన సమగ్ర సుందరంగా ఉంటుంది. అందులో విరాటపర్వంలో కీచక వధ ఘట్టంగానీ, ఉత్తర గోగ్రహణ ఘట్టంగానీ ఆయువు పట్టులు. ఉద్యోగంలో రాయబారాలు ముఖ్యమైన ఘట్టాలు. ఈ రెండింటిలోనూ తిక్కన యొక్క ఒడుపులన్నీ కనపడినట్లుగా అనిపిస్తుంది. ఎందుచేతనంటే, ఆయన మంత్రి; రచనా శిల్పంలో అందె వేసిన చెయ్యి ; శ్రవ్యాన్ని దృశ్యంలాగా మలచగల నేర్పు ఆయన కున్నది. ఇవన్నీ ఇక్కడ ప్రస్ఫుట మవుతాయి.

కీచకుడు ద్రౌపదితో అసభ్య ప్రలాపాలు చేస్తే, అతన్ని బెదిరించడానికి ఆమె అన్న మాటల్లో సమాస ఘటన ఎటువంటిదో చూడవచ్చును :

"దుర్వారోద్యమ బాహు విక్రమ రసాస్తోక ప్రతాపస్ఫుర
ద్గర్వాంధ ప్రతివీర నిర్మథన విద్యాపారగుల్ మత్పతుల్"

—విరాట. 2–55

కీచకుని చేత భంగ పడిన ద్రౌపది విరాటునితో తన భంగ పాటును చెప్పతూ, ఇంకేదో మాట్లాడబోతూ ఉంటే, కంకుభట్టు వేషంలో ఉన్న ధర్మరాజు వీధిని పడవద్దంటూ

"పలువోకలఁ బోవుచు వి
చ్చల విడి నాట్యంబు సూపుచాడ్పున నిచటం
గుల సతుల గఱువ చందము
దొలఁగఁగ నిట్లునికి దగునె తోయజ వదనా!"

—విరాట. 2–150

అని మందలించాడు. ద్రౌపది అతని వంక సాభిప్రాయంగా చూచి

"నాదు వల్లభుండు నటుఁడింత నిక్కంబ,
పెద్ద వారియట్ల పిన్నవారుఁ
గానఁ బతుల విధమగాక యేశైలూషిఁ
గా, ననంగరాదు కంకభట్ట"

—విరాట. 2–152

అట్లగుటం జేసి నాకు నాట్యంబును బరిచితంబ. మత్పతి శైలూషుండ కాఁడు, కితవుండునుం గావున జూదరి యాలికిగఱువ తనంబెక్కడిది? (విరాట. 2–153) అంది. ఎదురు దెబ్బ తగిలిన ధర్మజుడి అప్పటి స్థితి ఎల్లాంటిదో ఊహించ వచ్చు. తిక్కన పాత్రలన్నీ సంవాద కౌశలం గల పాత్రలే. మరొక్క ఉదాహరణ: కీచకుడు మారు వేషంలో ఉన్న భీముణ్ణి ద్రౌపదే అనుకొని తన గొప్పదనం చెప్పుకొంటూ

"నాదు రూపంబు మనంబునఁ జిక్కిన
తరుణి తక్కొరు నేల సరకుసేయు!
నాదు లావణ్యంబునకు నిచ్చమెచ్చిన
యెలనాఁగ పైఁబడ కేల నిలుచు!
నా విలాసంబులు భావింపఁ బడసిన
యింతి పుష్పాస్త్రుచే నెట్లు బ్రదుకు!
నా వివేకమున కానందింపఁ గనిన
యంగన యెట్లు నిలువునఁ గ్రాఁగ కుండు!
మెఱయు నా యాడు మాటలు తెఱవ పిండు
నుల్లములకు నింపారెడు నరులుగావె

యిట్లు నీ వొక్కతెవె నన్ను నేలు కొంటి
గాక మాట లింకేటికిఁ గమల వదన"

—విరాట. 2–335

ఈ దుర్విదగ్ధుడి మాటలకు భీముడు రెండర్థాలు వచ్చేటట్లు మాట్లాడిన మాటల వల్ల సన్నివేశగత హాస్యానికి సంవాదకౌశలం పదును పెట్టినట్లు స్పష్టం అవుతుంది.

"ఇట్టి వాఁడవు గావున నీవు నన్నుఁ
బొగడి కొనఁదగునకట నా పోల్కియాఁడు
దాని వెదకియు నెయ్యెడనైన నీకుఁ
బడయ వచ్చునె యెఱుఁగక పలికి తిట్లు!

నా యొడలు సేర్చి నప్పుడ
నీ యొడ లెట్లగునొ దాని నీ వెఱిఁగెదు న
న్నే యబలల తోడిదిగాఁ
జేయఁదలచితివి తప్పు సేసితి గంటే!

నను ముట్టి నీవు వెండియు
వనితల సంగతికిఁ బోవువాఁడవై యెనం
దనువేఁ బడసిన ఫలమే
కనియెద విదె చిత్తభావ వికారము లెల్లన్."

—విరాట. 2–237, 238, 239

కర్ణాశ్వత్థామలకు ఎల్లప్పుడూ షష్ఠాష్టకమే. అర్జునుడు యుద్ధానికి వస్తుండడం చూచి కర్ణుడితో అశ్వత్థామ

"నిను నీవ పొగడికొని పలి
కిన పలుకులుఁ బెక్కు గలవు క్రీడి యనికి వ
చ్చిన వాఁడిదె పులివలె మా
ర్కొన రాదె కర్ణ సేనకుం బ్రియ మెసఁగున్."

—విరాట. 2–22

'క్రీడి యనికి వచ్చిన వాఁడిదె పులి వలె' అనీ, 'పులి వలె మార్కొనరాదె' అనీ రెండు రకాలుగా, 'పులి వలె' అనేది రెండు పక్కలా మధ్యమణి న్యాయంగా అన్వయించు కోవచ్చును. తిక్కన సంవాదకౌశలం ఎల్లాంటిదో తెలును కోడానికి ఈ రెండు మూడుదాహరణలతో సరిపుచ్చి మరొక అంశానికి మరులుదాం.

తిక్కన ఏది వర్ణించినా గాని మన కళ్ల ముందు పటం గట్టి నట్లుగా ఉంటుంది. స్థాణు రూపం కంటె చలద్రూపాన్ని మనకు అతడు చూపిస్తాడు. కృష్ణరాయబారానికి ముందు ద్రౌపది శ్రీకృష్ణునితో మాట్లాడుతూ

"ద్రోవది బంధురంబయిన క్రొమ్ముడి గ్రమ్మున విడ్చి వెండ్రుకల్
దావలచేతఁబూని యసితచ్ఛవిఁ బొల్చు మహా భుజంగమో
నా విలసిల్లి వ్రేలఁగ మనంబునఁ బొంగు విషాద రోషముల్
గావఁగ లేక బాష్పములు గ్రమ్మఁగ దిగ్గనలేచి యార్తయై."

—ఉద్యో. 3–114

గోవిందు ముందటం బెట్టి యిట్లనియె.

"ఇవి దుస్ససేను వ్రేళ్లం
దవిలి సగము ద్రెస్సి పోయి దక్కినయవి కౌ
రవుల కడఁ దీఱు మాటల
యవసరమునఁ దలఁప వలయు నచ్యుత వీనిన్."

—ఉద్యో. 3–116

"ఈ వెండ్రుకలు వట్టి యీడ్చిన యా చేయి
దొలుతగాఁ బోరిలో దుస్ససేను
తను వింత లింతలు దునియలై చెదరి రూ
పఱి యున్నఁగని యుడు కాఱుఁగాక
యలుపాలఁబొను పడునట్టి చిచ్చే యిది......"

—ఉద్యో. 3–116

ఈ పద్యాల్లో ద్రౌపది పలుకులతో బాటు ఆమె చర్యలు మన మనోనేత్రం ముందు పటం గట్టినట్లుంటాయి. దర్శకుడు పాత్రలకు కావలసిన సూచనలన్నీ ఇచ్చి నట్లుంటాయి తిక్కన పలుకులు.

యుద్ధ దృశ్యాలు ఒక వయస్సులో ఎంతగా ఉద్రూతలూగిస్తాయో, కొంత వయస్సు మళ్లిన తర్వాత అంతగా విసుగెత్తిస్తాయి చాలా మందికి. కాని సమర్థు డైన కవి వాటిని జాగర్తగా నిర్వహిస్తే మనస్సుకు హత్తు కొంటాయి. తిక్కన జాగర్తగా యుద్ధ పంచకం నడిపాడు. యుద్ధ వర్ణన కళ్లకు కట్టినట్లుగా

"నొంచినఁ గెంపు సొంపునఁ గనుంగవ యొప్పఁగ సూతుఁద్రుంచి విల్
ద్రుంచి తురంగ వక్త్రములఁ దూపులు నించి యలంచి మేనునొ
ప్పించినఁ దేరితోడ నఱపినుఁగు నీడిచికొంచుఁ బాఱెసే
నాంచల భూమికిం బెలుచ నత్తురగంబులు విహ్వలంబులై."

—ద్రోణ. 2–74

ఈ పద్యంలో వర్ణించాడు కవి. జుగుప్సాకరమైనవాటినిగూడా "దారుణ ప్రియ దర్శనం"గా వర్ణించగల నేర్పు తిక్కనకు ఉంది.

తిక్కన రచన ఔచితీమంతంగా ఉంటుంది. శాస్త్రేతిహాసమైన సంస్కృత భారతంలోని భగద్గీతను, సంగ్రహించి వ్రాసాడు తిక్కన. సూత్రప్రాయంగా గీతలో

చెప్పినవాటిని, ఉపాఖ్యాన వ్యాఖ్యాన పూర్వకంగా, శాంత్యానుశాసనిక పర్వాల్లో ఎల్లగా చెప్పుతున్నాంగదా అని పునరావృత్తిని తొలిగించాడు. మరి ఇక్కడ ఇది కావ్యేతిహాసం గదా! శాంత్యానుశాసనిక పర్వాల్లోనూ ఆ తర్వాతా తిక్కన రచన నిగ్గుతేలి, నిబ్బరంగా కొనసాగింది. వేదాంత విషయాల్నికూడా సులువుగా అర్థం అయ్యేటట్లు వ్రాయడం ఒక గొప్ప నేర్పు. వ్యాసులవారి మాదిరిగానే తిక్కనకుగూడా ఇది వెన్నతో బెట్టిన విద్య. ఈ పద్యం చూడండి :

"వినయము విద్యయుఁ గలుగు విప్రునియందును గోవునందు నొ
ప్పు నెఱయు హస్తియందు నొక పోఁకకుఁ బోవని కుక్కయందు దా
ని నడఁచి తెచ్చివండి తిను నీచపు మాలనియందుఁ దుల్య ద
ర్శనులు దదంతరాత్ముని నిరంజనునిం గనునట్టి పండితుల్"

—శాంతి. 5–109

ఇది వ్యాసులవారి రచన
"విద్యా వినయ సంపన్నే బ్రాహ్మణే గవిహస్తిని
శుని చైవ శ్వపాకేచ పణ్డితాః సమదర్శినః"

—గీత. 5–18

వలెనే సులభగ్రాహ్యము.

తిక్కన తెలుగు మాటలకు గల బలాన్ని తన రచనద్వారా నిరూపించాడు. ఈ పద్యం చూడండి :

"తనుఁ దాన తొలుత గెలువన్
మనుజపతికి వలయుఁ బిదప మార్తుర గెలువన్
మనమునఁ దలంచునదియును
దను గెలువని పతికి గెలువఁదఱమే పగఱన్"

—శాంతి. 2–276

అర్జున దుర్యోధనులతో శ్రీకృష్ణుడు పలికిన తీరులో ఎన్ని తెలుగుపదాలో చూడండి :

"వారొకతల యేనొకతల
యీ రెండు తెఱంగులందు నెయ్యది ప్రియ మె
వ్వారికిఁ జెప్పుడు దొలతొలి
కోరికొనన్ బాలునికిఁ దగుంబాడిమెయిన్"

—ఉద్యో. 1–75

నీతి బోధలోకూడా తెలుగు పదాల పొందిక ఎట్టిదో పరికించండి :

"నడవడియును మున్నీటిం
గడవం బెట్టంగ నోడ కరణిఁ దగి తా

నొడఁగూడు ననిన సత్యము
గడచిన గుణమింక నొందుగలదే యరయన్!"

—ఉద్యో. 2-39

"తనియఁ బండకుండ మునుగోసి కొనఁ జవి
చేటెగాదు విత్తు చేటుఁగలుగుఁ
బక్వమైనఁ గొనిన ఫలమించుఁ జెడదు బీ
జంబుఁ గార్యసిద్ధి చందమిట్లు"

—ఉద్యో. 2-56

"బెడిదముగఁ గత్తి గొడ్డటఁ
బొడువఁ దెగిన మ్రానఁ జిగురు వొడముఁ బలుకులం
జెడ దునిసిన కార్యంబు ని
గుడ నేరదు పిదప నెట్టుఁ గురువంశ నిధీ"

—ఉద్యో. 2-61

ఇల్లాంటి పద్యాలు తిక్కన రచనలోంచి వందలకొలది ఎంపిక చెయ్యవచ్చు.

తిక్కన సందర్భాన్నిబట్టి రచనావిధానాన్ని మారుస్తూ ఉంటాడు. కేవలం తెలుగు పదాలతో ఎల్లా భావాన్ని మన మనస్సుకు హత్తుకొనేటట్లు చేస్తాడో, సంస్కృత పదాలతోగూడా అల్లాగే చేయగలడు. సంస్కృతమే వాడాలనిగాని, లేక తెలుగే వాడాలనిగాని ఆయనకు పట్టింపులేదు. అవసరాన్నిబట్టి సంస్కృతాంధ్రాలను సమ ప్రావీణ్యంతో వాడగల దిట్ట తిక్కన. ఒకటి రెండు ఉదాహరణలు తీసుకొందాం.

ఉత్తర గోగ్రహణ సందర్భంలో ఉత్తరుడు కౌరవ సైన్యాన్ని చూచి అన్న మాటల్లో కౌరవ సైన్యంయొక్క ఉద్దండత స్పష్టం అవుతోంది :

"భీష్మ ద్రోణ కృపాది ధన్వి నికరాభీలంబు దుర్యోధన
గ్రీష్మాదిత్య పటు ప్రతాప వినరా కీర్ణంబు శస్త్రాస్త్ర జా
లోష్మస్ఫార చతుర్విధోజ్జ్వల బలాత్యుగ్రంబువ గ్రధ్వజా
ర్చిష్మత్వా కలితంబు సైన్యమిదియే జేరంగశక్తుండనే !"

—విరాట. 4-52

"నీలగళుండు శంకరుఁడు నిత్యుడు సత్య సురూపుఁ డుజ్జ్వల
త్కాల మహానల ప్రశమక ప్రచురామృత వృష్టి విస్ఫుర
ద్బాల మృగాంక శేఖరుఁడు, దైత్యకుల ప్రవిదారుణ క్రియా
లోల పరశ్వథుండు సకలుం డమలుండు ప్రియుండు శాంతికిన్"

—ద్రోణ. 5-427

ఈమాదిరిగా ఉదాహరణలిస్తూపోతే, తిక్కనయొక్క భారతభాగం అంతటినీ ఉదాహరించవలసివస్తుంది. కానీ, కొండంత దేవుడికి కొండంత పత్రి తీసుకొని

రాగలమా ? కనుక యీ విషయాన్ని ఇక్కడ విడిచి ముందుకు సాగుదాం.

మనం ముందుకు సాగుతూనే ఉన్నాం. అయితే కాలంలో ముందుకు సాగామే గాని, భారతంలో వెనక్కి వెళ్లవలసి వస్తుంది.

నన్నయ్య రెండున్నర పర్వాలే రచించాడు. నట్టడవిలో భారతం ఆగిపోయింది. తిక్కన విరాటపర్వంనుంచే మొదలుపెట్టి మొత్తం 15 పర్వాలూ పూర్తిచేశాడు. "హరిహరనాథ! సర్వభువనార్చిత! నన్ గృపఁజూడు మెప్పుడున్" అని తిక్కన మరి వెనుకకు చూడలేదు.

ఈ దశలో ఎఱ్ఱాప్రగడ ఆంధ్ర దేశంలో అవతరించాడు. భారతం అసమగ్రంగా నిలిచిపోవడం అతని మనస్సుకు బాధగా తోచింది.

"………బుద్ధి బాహు వి
క్రమమున దుర్గమార్థజల గౌరవ భారతభారతీ సము
ద్రము దరియంగ నీదను నిధాతృనకైనను నేరబోలునే!"

—ఆది. 1-19

అని వినీతుడై నన్నయ్య అన్నాడు. కాని, నన్నయ్య తానే ఒక మహాసముద్రుడు. అటు తిక్కన మరొక మహాసముద్రుడు. వార్ధులగు వారిద్దరి మధ్యఉన్న వారధిగా గాక, ఎఱ్ఱన ఆ యిరువురి మధ్యనున్న జలసంధిగా రూపొందాడు. రెండు మహాసముద్రాలవంటి మహాకవులను, రెండు మహాసముద్రాలవంటి భారత భాగాలను ఏకసముద్రంగా మలచిన ఘనత ఎఱ్ఱనది. కాని, నన్నయ్య తిక్కనలకంటె ఎఱ్ఱన, వినీతునిగా భారతంలో సాక్షాత్కరిస్తాడు. రచన అంతా నన్నయ్య మాదిరిగానే కొనసాగించాడు. ఇందులో తన గొప్పదనం ఏమీలేదని

"ఎఱ్ఱనార్యుండు సకల లోకైక విదితుఁ
డయిన నన్నయభట్ట మహాకవీంద్రు
సరస సారస్వతాంశ ప్రశస్తిదన్నుఁ
జెందుటయు సాధుజన హర్ష సంసిద్ధిఁ గోరి

ధీర విచారుఁడు తత్కవి
తారీతియుఁ గొంతఁదోఁపఁ దద్రచనయకా
నారణ్య పర్వశేషము
పూరించెఁ గవీంద్రకర్ణపుటపేయముగాన్"

—అరణ్య. 7-469, 470

అని చెప్పుకొన్నాడు. అయితే ఎఱ్ఱన, నన్నయ్యనుంచి పొందిన సరససారస్వతాంశ ప్రశస్తిని తిక్కన 'తన కావించిన సృష్టి తక్కొరులచేతన్ కాదునాన్'గా మలచుకొన్నాడు. ఎఱ్ఱన విశిష్టత ఇది.

సంప్రదాయం ప్రకారం నన్నయ్య వ్రాసిన చివరి పద్యం

"శారదరాత్రు లుజ్జ్వలలసత్తర తారక హారపంక్తులం
జారుతరంబులయ్యె వికసన్నవ కైరవగంధ బంధు రో
దార సమీర సౌరభము దాల్చి సుధాంశువికీర్యమాణ క
ర్పూర పరాగ పాండు రుచి పూరములం బరిపూతంబులై"

—అరణ్య. 4–142

నన్నయ చల్లని శరద్రాత్రి వర్ణించాడు. తర్వాత ఎఱ్ఱన

"స్ఫురదరుణాంశు రాగరుచిఁ బొంపిరివోయి నిరస్త నీరదా
వరణములై దళత్కమల వైభవ జృంభణముల్లసిల్ల ను
ద్ధురతర హంస సారస మధువ్రత నిస్వనముల్ సెలంగఁగాఁ
గరము వెలింగె వాసర ముఖంబులు శారదవేళఁ జూడఁగన్"

—అరణ్య. 4–143

అనే పద్యంతో అరణ్యపర్వంలో మిగులు భాగాన్ని పూర్తిచేయడం మొదలుపెట్టాడు. నన్నయ్య చల్లని వెన్నెలలశరద్రాత్రిని వర్ణించినా అది రాత్రే. నాటినుంచి భారత విహాయసంలో కాళరాత్రే రాజ్యం చేసింది. కాని ఎఱ్ఱన వాసరముఖాన్ని వర్ణించి హరించుకుపోయిన వెలుగును మళ్ళీ తెచ్చాడు. చాలామంది కవులకి ఉన్నట్లుగానే ఎఱ్ఱనకుకూడా చిన్న చమత్కారం చేద్దామని బుద్ధిపుట్టింది. 'నే నిక్కణించే మొదలు పెట్టాను సుమా' అని 'స్ఫురదరుణాంశు రాగ రుచి' అనే మాటలు వాడినాడు. 'అరుణ' శబ్దానికి 'ఎఱ్ఱయ్య' అనే అర్థం. అతనియొక్క స్ఫురణ ఇక్కణించే ప్రారంభమయింది. ఎఱ్ఱన నన్నయతో ప్రారంభించి, తిక్కనతో కలిసిపోయాడనికదా అనుకొన్నది. ఎఱ్ఱన మొదట్లో వ్రాసిన మరో పద్యాన్ని పరిశీలిద్దాం :

"దానాంభః పటలంబునం బృథుపయోధారావలిం దాల్చి గ
ర్జా నిర్ఘోషము బృంహితచ్ఛలనఁ బ్రచ్ఛాదించి ప్రావృట్పయో
దానీకంబు శరద్భయంబున నిగూఢాకారతన్ డిగ్గినాఁ
గా నొప్పారె మదోత్కట ద్విరద సంఘంబుల్ వనాంతంబునన్"

—అరణ్య. 4–144

అరణ్య పర్వం చివరికి వస్తున్నకొలదీ తిక్కన రచనను తలపింపచేస్తున్నది ఎఱ్ఱన రచన. ఒకటి రెండు పద్యాలు పరిశీలిస్తే యీ విషయం బాగా పొడగట్టుతుంది :

"తల్లి వ్రేఁగు సువ్వె ధరణికంటెను ; నాక
సంబుకంటెఁ బొడవుజనకుఁ డరయ ;
గాడ్పుకంటె మనసు గడు శీఘ్రగతి ; తృణో
త్కరముకంటెఁ జింత గరము తఱచు"

—అరణ్య. 7–435

"ఆత్మజుఁడు నువ్వె పురుషున కాత్మయయ్యె;
నాతనికి భార్యదై వికమైన చుట్ట;
మతని జీవిక పర్జన్యుకతనఁ జెల్లు;
నతఁడు దానము గొనియాడి యతిశయిల్లు"

—అరణ్య. 7-445

ఈ పద్యాల్లో తిక్కనబాణి స్పష్టమవుతుంది.

ఈ రకంగా మహాభారతాన్ని ఆమూల చూడమూ అందాలొలికేటట్లు తెలుగులో తీర్చిదిద్ది, ఆంధ్ర కవితాలోకానికి వెలుగుబాటలు వెలార్చిన కవిత్రయం ఆంధ్ర లోకానికి ప్రాతః స్మరణీయులు.

BCI

AOUA102B121

V. R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D. P. R. I.
Acc. No.

BC

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA102B121 |
| పుస్తకం పేరు | శారద దరహాసాలు |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 29 |
| పెద్ద సైజు పేజీలు | no |
| ఖాళీ పేజీలు | CI, BC, U, |
| లేని పేజీలు | BC |
| తయారు చేసినది | M. Raj |
| పేజీలు విడదీసినది | M. Raji |
| స్కాన్ చేసినది | Cawaye |
| పరీక్ష చేసినది | anusha |
| పేజీలు పరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | Good |